ఇందిరమ్మ.. ఇంకెప్పుడు?

- పూర్తయిన పరిశీలన
- ఎదురుచూపుల్లో లబ్ధిదారులు


గోండ్‌గూడలో అర్హుల జాబితా తయారుచేస్తున్న అధికారులు

కెరమెరి: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకంలో భాగంగా గ్రామ పంచాయతీ అధికారులు ఇటీవల ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. గ్రామ పంచాయతీల వారీగా మంజూరైన సంఖ్యను సైతం అధికారులు ఖరారు చేశారు. ఇంత వరకూ బాగానే ఉన్నప్పటికీ నేటికీ లబ్ధిదారులను ఎంపిక చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

జాబితా ఇచ్చిన కమిటీ సభ్యులు

అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు జాబితాను అధికారులకు అందించారు. మండల వెరిఫికేషన్ అధికారులు వాటిని పూర్తి చేసి మండల పరిషత్ కార్యాలయంలో నివేదిక అందజేశారు. ఆ జాబితాను ఎంపీడీవో జిల్లా అధికారులకు అందించినప్పటికీ ఇప్పటి వరకూ అర్హుల జాబితాను విడుదల చేయలేదు. దీంతో ఇందిరమ్మ ఇళ్లు ఎవరిని వరిస్తాయోనని ఇళ్లులేని నిరుపేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

270 గృహాలు మంజూరు

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే కొఠారి గ్రామ పంచాయతీకి 108 గృహాలు మంజూరుకాగా నిర్మాణంలో ఉన్నాయి. కాగా ఇందాపూర్ గ్రామ పంచాయతీలో ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు కాలేదు. మిగిలిన 29 గ్రామ పంచాయతీల్లో 270 ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయి. వాటిలో కెరమెరి గ్రామ పంచాయతీకి 49 గృహాలు మంజురయ్యాయి. మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్నవారినే ఎంపిక చేశారు.

జిల్లా అధికారులకు జాబితా పంపించాం



మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో కమిటీ సభ్యులు ఇచ్చిన అర్హులైన వారి జాబితాను జిల్లా అధికారులకు పంపించాం. ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి మండలానికి జాబితా పంపిస్తే తప్ప ఆ జాబితాలో అర్హులు ఎవరున్నారనేది తెలియదు.

– అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

ఆసిఫాబాద్‌లో డ్రెయినేజీ కష్టాలు


ఇళ్ల మధ్యలో నుంచి పారుతున్న మురికి నీరు


రోడ్డుపై పారుతున్న వరదనీరు (ఫైల్)


- రోడ్డుపైనే నిలిచి ఉంటున్న మురుగునీరు
- చెరువులను తలపిస్తున్న రహదారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే నిలిచి ఉంటోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధిచెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీవాసుల ఇబ్బందులు

జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్, రాజంపేట్, బెస్తవాడతో పాటు జూబ్లీ మార్కెట్, వివేకనంద చౌక్‌లలో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచి ఉంటోంది. అటువైపు వాహనాలు వెళ్తే మురికి నీరు పాదచారులపై పడుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. పైకాజీనగర్‌లో డ్రెయినేజీల నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.2.5 కోట్ల నిధులు మంజూరుకాగా కొంతమేర డ్రెయినేజీలు నిర్మించి అర్ధంతరంగా వదిలేశారు. రోడ్డుపక్కనే వర్షపు నీరు నిలిచి ఉండడంతో సీసీరోడ్డు సైతం కోతకు గురవుతోందని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

పట్టించుకోవడం లేదు



మాది పైకాజీ నగర్. మా ఇల్లు నాలా పక్కనే ఉంది. దీంతో వర్షం కురిసిన ప్రతీసారి నీటి ప్రవాహానికి ఇంటి పక్కనే ఉన్న షెడ్డు కూలిపోయింది. అంతేకాకుండా ఇంటిగోడ సైతం పునాది నుంచి కోతకు గురవుతోంది. డ్రెయినేజీ నిర్మించాలని పలుమార్లు సంబందిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

– రమేశ్, పైకాజీ నగర్

క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శుక్రవారం మండలంలోని అంతపూర్ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు సరిగా నమోదు చేయాలన్నారు. అనంతరం నర్సరీ, షెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ ఉన్నారు.

కేజీబీవీలో అడ్మిషన్లు షురూ

బెజ్జూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రత్యేకాధికారి అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియం ఆరో తరగతిలో 20 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ సీఈసీలో 30 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువకుడి అప్పగింత

బెజ్జూర్: ఇంటి నుంచి పారిపోయిన యువకుడి ఆచూకీ గుర్తించి ఎస్సై ప్రవీణ్ కుమార్ శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మండలంలోని ఎలుకపల్లి బి గ్రామానికి చెందిన సొంటెంక రమేశ్ గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలించగా రమేశ్ ఆచూకీ లభించింది. యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు శివమల్లన్న ఆలయ వార్షికోత్సవం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 9.30 గంటలకు గణపతి పూజ, రుద్రాభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

తిర్యాణి: దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమయ్యే పరికరాల కోసం శుక్రవారం మండల కేంద్రంలోని రాయి సెంటర్ భవనంలో దరఖాస్తులు స్వీకరించినట్లు ఆ శాఖ జిల్లా ఫీల్డ్ రెస్పాన్ అధికారి రవికుమార్ తెలిపారు. మొత్తంగా 120 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి నెలరోజుల వ్యవధిలో అర్హులకు పరికరాలు అందించనున్నట్లు తెలిపారు.

'అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలి'

ఆదిలాబాద్‌టౌన్: పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ గిరిజనులపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం ఆపాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీ గిరిజనులు పోడు సాగు చేస్తున్నారని, ప్రభుత్వ ప్రోద్బలంతో అధికారులు అమాయకులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలనలో పోడు సమస్య ఉత్పన్నం కాలేదని, గిరిజన, గిరిజనేతర పేదలు సాగు చేస్తున్న వేలాది ఎకరాల అటవీ భూమిని సర్వే చేసి పట్టాలు అందించారన్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు దాడులు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


జిమ్నాజీ మృతదేహం

ఆసిఫాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిలాటిగూడకు చెందిన జిమ్నాజీ (45), కూతురు వెన్నెల, అల్లుడు సోను బైక్‌పై ఆసిఫాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. బూర్గుడ సమీపంలోని యూటర్న్ వద్ద రోడ్డు దాటుతుండగా మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న స్కార్పియో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జిమ్నాజీ అక్కడికక్కడే మృతి చెందగా వెన్నెల, సోనుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రిలయన్స్ ట్రెండ్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని షాపింగ్ మాల్‌లో శాలువాతో సత్కరించి మెడల్స్, గిఫ్ట్ కార్డులను అందజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: ప్రతిఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందానిలో డ్రైడే కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. టబ్‌లు, టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగి, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సోకుతాయన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌పీహెచ్ మమత, ఏఎన్ఎం కాంత, హెచ్ఏ భగవాన్ దాస్, పంచాయతీ కార్యదర్శి దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి


మాట్లాడుతున్న భరత్

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. మండలంలోని పాటగూడ, బాబేఝరి, పిట్టగూడ, గొండుగూడ, పాట్నాపూర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఐటీఐ, ఏటీసీ, ఇంటర్మీడియెట్ కోర్సుల గురించి వివరించారు. గురుకుల కౌన్సిలింగ్‌కు హాజరుకాని విద్యార్థులను కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా ఉన్నత చదువులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పెందోర్ మోతీరాం, పెందోర్ శ్రీనివాస్, చహ్కాటి సంజీవ్, సిడాం భీంరావు, టేకం భీంరావు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి


క్రీడాకారులతో జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): క్రీడాకారులు నచ్చిన ఆటలో నైపుణ్యం పెంచుకుని జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందించారు. ఆయన మాట్లాడుతూ నిరంతర సాధనతోనే నైపుణ్యాలు మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మారం శ్రీనివాస్, కై రిగూడ పీవో నరేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనా బాషా, ఏరియా ఇంజినీర్ రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, సీనియర్ పీవో అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

జూన్ 2న గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను జీఎం విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఉద్యోగులు, కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఆసిఫాబాద్ మండలంలోని మాలన్ కొంది, కొసారా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వంతెనపైపు కింద పడిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వంతెన పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ఆసిఫాబాద్‌రూరల్

బాల్యవివాహం అడ్డగింత


కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీవో మహేశ్

పెంచికల్‌పేట్: మండలంలోని చెడ్వాయి కొత్తగూడెం గ్రామానికి చెందిన మైనర్ బాలికకు వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ ఆధ్వర్యంలో వివాహాన్ని అడ్డుకున్నారు. ఇరువురి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా ఎదురయ్యే సమస్యలు, అనర్థాలను వివరించారు. డీసీపీవో మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, రూ.ల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఎక్కడైన నిర్దేశిత వయస్సు నిండకుండా వివాహాలు జరిపిస్తే టోల్ ఫ్రీ 1098 లేదా 112కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ రవళి, సూపర్ వైజర్ హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే రైతుల అభివృద్ధి


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కౌటాల: బీజేపీతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుంచాల విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆరె సంఘం భవనంలో శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర పెంచడం సంతోషకరమన్నారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దుర్గం మోతీరాం, నాయకులు మధుకర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'జొన్నల కొనుగోలు గడువు పొడిగించాలి'

నేరడిగొండ: జొన్నల కొనుగోలు తేదీని పొడిగించాలని సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా సాగుతుండడంతో కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వర్షాలకు జొన్నలు తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న సీఐ రహీంపాషా

నార్నూర్: పండుగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ రహీంపాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న నిర్వహించే బక్రీద్ పండుగను అందరూ కలిసిమెలిసి శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకుని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అఖిల్, మైనార్టీ పెద్దలు జాకురుల్లాఖాన్, షేక్ హుస్సేన్, మన్సూర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాలే సిట్టింగ్ పాయింట్లు


రైల్వేగేట్ పక్కన గల వెంచర్‌లో మందుబాబులు తాగిపడేసిన మద్యం సీసాలు

రెబ్బెన: నిర్మానుష్యంగా ఉండే ఖాళీ ప్రదేశాలు మందుబాబులకు మంచి అడ్డాలుగా మారుతున్నాయి. అట్టి ప్రదేశాల్లో పగలు రాత్రి తేడా లేకుండా సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని హాయిగా మద్యం సేవిస్తున్నారు. మండల కేంద్రానికి అనుకుని ఉన్న వెంచర్లు, గోలేటి విలేజ్ పాత రోడ్ మందుబాబులకు మంచి అడ్డాలుగా మారాయి. అలాగే పులికుంట వాగు సమీపంలో ఏర్పాటు చేసిన వెంచర్‌తో పాటు గోలేటి భీమన్న ఆలయ పరిసరాలను మందుబాబులు అడ్డాగా మార్చుకుని మద్యం సేవిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమైనప్పటికీ మందుబాబులు అవేం పట్టించుకోవడం లేదు. పోలీసులు సైతం ఈ విషయంపై అంతగా పట్టించుకోకపోవడం మందుబాబులకు కలిసివస్తోంది.

సమగ్ర విచారణ చేపట్టాలి


వినతిపత్రం ఇస్తున్న వీవోఏ కరుణాకర్‌గౌడ్

కౌటాల: మండల సమాఖ్యలో స్త్రీనిధి అప్పు రికవరీపై సమగ్ర విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కౌటాల వీవోఏ కరుణాకర్‌గౌడ్ శుక్రవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనంతో 22 ఏళ్లుగా కౌటాల వీవోఏగా పని చేస్తున్నానని తెలిపారు. కౌటాల ఏపీఎం కక్షపూరితంగా ఈ నెల 24న స్త్రీనిధి ఆర్ఎం, మేనేజర్, డీపీఎం, సీసీతో కలిసి ఉద్దేశపూర్వకంగా ఆధారాలు లేకుండా రూ.12లక్షలు కాజేస్తున్నట్లు తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పదిహేనేళ్ల క్రితం కౌటాల మండల సమాఖ్యలో సీసీగా బాధ్యతలు నిర్వహించిన ప్రస్తుత ఏపీఎం అక్రమాలకు పాల్పడి ఒకసారి సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు. మహిళా సంఘాలను రెచ్చగొట్టి అకారణంగా తనపై నిందలు మోపుతున్నారని ఆరోపించారు. పూర్తిస్థాయి విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని కోరారు.

నిరుపయోగంగా శ్మశానవాటికలు


2021లో వచ్చిన వరదలతో ధ్వంసమైన శ్మశాన వాటిక ద్వారం

గత ప్రభుత్వం నిర్మించిన శ్మశానవాటికలపై పర్యవేక్షణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మూడేళ్ల క్రితం పెద్దవాగులో భారీ వరదలు రావడంతో దహెగాం మండలంలోని లగ్గాం, చౌక గ్రామాల సమీపంలో నిర్మించిన శ్మశానవాటికలు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– దహెగాం


కూలిన చౌక వైకుంఠధామం